క్లుప్తంగా

నాగేశ్వరరావు సేవలు మరువరానివి



తెనాలిఅర్బన్: నాగేశ్వరరావు సేవలు మరువరానివని ఫిరంగిపురం డిప్యూటీ తహసీల్దార్ రాజారమేష్, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండల విద్యాశాఖలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన పిడపర్తి నాగేశ్వరరావు వీడ్కోలు సభను మంగళవారం కొత్తపేటలోని ఎంఈవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో నాగేశ్వరరావు పనిచేసే వారని తెలిపారు. 30 సంవత్సరాలు ఎటువంటి ఒడిదొడుకులు లేకుండా ఉద్యోగం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం నాగేశ్వరరావు, మేరి జోన్స్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

డాక్టర్ సాయిపవన్‌కు గోల్డ్ మెడల్ ప్రదానం



తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా స్థానిక బోస్‌రోడ్డులోని కార్యాలయంలో ప్రత్యేక సభను సోమవారం రాత్రి నిర్వహించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ఎ.సాయిపవన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆధునిక వైద్య విధానంలో గుండె శస్త్ర చికిత్సల గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిపవన్‌కు డాక్టర్ సీఎస్ ఆర్కే ప్రసాద్ ధార్మిక గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ మధుప్రభాకర్ బాబు, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ బీసీహెచ్ సాంబిరెడ్డి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు తదితర వైద్యులు పాల్గొన్నారు.

యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు ఉండవు

తెనాలిరూరల్: ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఇకపై ఉండదని విద్యుత్ శాఖ తెనాలి డీఈఈ వీవీ చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు యూపీఐ యాప్‌లలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు నిలిపివేసినట్టు చెప్పారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, ప్రత్యేక కౌంటర్లలో బిల్లులు చెల్లించవచ్చని లేదా ఏపీసీపీడీసీఎల్ యాప్ ద్వారా లేదా www.apcpdc.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయవచ్చన్నారు.

'ఏది అసలైన ఆనందం' కు నగదు బహుమతి



తెనాలి: కెనడా దేశంలోని కెనడా డే తెలుగుతల్లి పత్రిక నిర్వహించిన అంతర్జాతీయ కథలు, కవితల పోటీల్లో తెనాలికి చెందిన కారంచేటి విజయకుమార్ కవిత నగదు బహుమతికి ఎంపికైంది. పోటీలకు 'ఏది అసలైన ఆనందం' అనే శీర్షికతో విజయకుమార్ రాసిన కవితను పంపారు. కథలు, కవితల పోటీల్లో విజేతలను పత్రికా యాజమాన్యం ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. కవితల పోటీలకు న్యాయనిర్ణేతలుగా కొండేపూడి నిర్మల, పూదూరి విజయభాస్కరరెడ్డి అందుగులపాటి విశ్వశాంతి, నేరెళ్ల విజయభారతి వ్యవహరించినట్టు తెలిపారు.

శ్మశానంలో పారిశుద్ధ్యం కోసం వినతి

తాడేపల్లిరూరల్: దళితుల సమాధుల తోటలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మంగళవారం మాదిగ కార్యాచరణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జముళ్ళమూడి సుధాకరరావు ఆధ్వర్యంలో ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జముళ్ళమూడి సుధాకరరావు మాట్లాడుతూ సమాధులను పవిత్రంగా భావిస్తామని, అక్కడ కొందరు విసర్జన చేస్తున్నారన్నారు. విపరీతంగా పెరిగిన కంప మొక్కలను తొలగించాలని కోరినట్లు తెలిపారు. సంఘ కార్యదర్శి మనోజ్ కుమార్, ఉపాధ్యక్షుడు కటికల మోహన్, సహాయ కార్యదర్శి ప్రశాంత్, కోశాధికారి క్రీస్తుదాసు పాల్గొన్నారు.

యువకుల మధ్య ఘర్షణ

పట్నంబజారు: యువకుల మధ్య స్వల్ప ఘర్షణ గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. తెలిసిన సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం సమయంలో పూటుగా మద్యం తాగి మత్తులో ఉన్న కొంత మంది యువకుల మధ్య లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఏలూరు బజారులో ఘర్షణ జరిగింది. యువకులు రెండు వర్గాలుగా ఏర్పడి ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని సర్దిచెప్పిన వినకపోవడంతో యువకులను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నట్లు సమాచారం.

ముగిసిన పింఛన్ల పంపిణీ



మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌లో యోహాన్‌కు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ సంధ్య



ఎరుకలపూడిలోని ఆసుపత్రిలో నాగమ్మకు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ తిరుపతిరావు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముగిసింది. అందుబాటులో లేని, మిగిలిన లబ్ధిదారులకు వాటిని సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పంపిణీ చేశారు. తెనాలి పట్టణంలో నూరు శాతం పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు. చినరావూరుకు చెందిన రావూరి యోహాన్ అనారోగ్యంతో బాధపడుతూ మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ సెక్రటరీ సంధ్య అక్కడకు వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందించారు. అలాగే 18వ వార్డుకు చెందిన డి.నాగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఎరుకలపూడిలోని చందు సుబ్బారావు ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ సెక్రటరీ ఎ.తిరుపతిరావు అక్కడకు వెళ్లి వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేశారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్

తెనాలిఅర్బన్: నీట్ పరీక్ష పేపర్ లీక్ అవడాన్ని నిరసిస్తూ గురువారం దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ పేర్కొన్నారు. చెంచుపేటలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అన్ని రకాల అర్హత పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన విద్యార్థులు చాలా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సుభాష్ మాట్లాడుతూ విద్యా రంగాన్ని కేంద్ర ప్రభుత్వం పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అర్హత పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని కోరారు. విద్యార్థి సంఘ నాయకులపై ఉన్న అక్రమ కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మద్దినేని కిరణ్‌బాబు, దండు శివ, పి.దుర్గాప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు వై.శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ ఎంపికలో ఎస్‌వీవీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో హెచ్ఎం అడ్డగడ్డ వీర వరప్రసాద్, పీఈటీ సుంకర శ్రీనివాస్

తాడికొండ: జిల్లా స్విమ్మింగ్ ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నలుగురు ఎంపికైనట్లు తాడికొండ ఎస్‌వీవీ హైస్కూల్ హెచ్ఎం అడ్డగడ్డ వీర వరప్రసాద్, పీఈటీ సుంకర శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా స్విమ్మింగ్ జట్టు ఎంపికలో భాగంగా గుంటూరు జిల్లా అక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులోని నెక్స్ట్ జెన్ పాఠశాలలోని స్విమ్మింగ్ పూల్‌లో ఎంపికలు జరిగినట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు మార్కపూడి రామ్ ప్రకాష్, తుపాకుల వీరాంజనేయులు, షేక్ ఫయాజ్, పఠాన్ ఖాజా మస్తాన్‌వలి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఎంపికైనట్లు తెలిపారు. 50 మీటర్లు, 100 మీటర్లు, 100 మీటర్ల ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్‌లలో వివిధ ఏజ్ గ్రూపుల ఈత పోటీల్లో పాల్గొని జిల్లా జట్టుకు ఎంపికయ్యారని వెల్లడించారు. వీరు ఈ నెల 13, 14 తేదీల్లో కర్నూలులోని ఏపీ అమెట్యూర్ అక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే స్టేట్ మీట్ పోటీలలో పాల్గొనేందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ అందించిన గుంటూరు సీనియర్ స్విమ్మింగ్ కోచ్ షేక్ ఖాజా మోహిద్దీన్, ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయుడు సుంకర శ్రీనివాస్‌లతో పాటు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పరిశోధన ప్రచురణల్లో నాణ్యత పెంపుపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ అరుణ్‌శర్మా

గుంటూరు రూరల్: క్యాన్సర్, న్యూరోడెజనరేటివ్ డిజార్డర్స్ వంటి సంక్లిష్ట వ్యాధులను లక్ష్యంగా చేసుకునే సామర్థ్యంలో రానున్న తరం చిన్న మాలిక్యూల్ థెరప్యూటిక్స్ వైద్య పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులు చేస్తున్నారని యూఎస్ఏలోని పెన్ స్టేట్ మెడికల్ స్కూల్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ్‌శర్మ తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో డెవలప్‌మెంట్ ఆఫ్ పొటెన్షియల్, నెక్స్ట్ జనరేషన్ స్మాల్ మాలిక్యూల్ థెరప్యూటిక్స్ అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణువులు నిర్మాణాత్మకంగా విభిన్నంగా ఉంటాయని, గతంలో చికిత్స చేయలేని పరిస్థితుల్లో కచ్చితమైన జోక్యాలను రానున్న కాలంలో చేపట్టేందుకు వీలవుతుందన్నారు. నాగాలాండ్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ సిన్హా మాట్లాడుతూ పరిశోధన ప్రచురణల్లో నాణ్యత మెరుగుదల కచ్చితత్వం, విశ్వసనీయత కోసం కఠినమైన పీర్ సమీక్షతో ప్రారంభించటం జరుగుతుందన్నారు. మెథడాలజీ, డేటా సోర్స్‌లలో పారదర్శకత, పునరుత్పత్తి, నమ్మకాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఓపెన్ యాక్సెస్ విస్తృతంగా కచ్చితమైన పరిశీలనను ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు అతిథులను ఘనంగా సన్మానించారు.

ఎఫ్ఎస్ఎస్ చెక్కు అందజేత



తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియషన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్.అప్పారావు ఫ్యామిలీ సెక్యూరిటీ స్కీము(ఎఫ్ఎస్ఎస్) నిర్వహిస్తున్నారు. ఇందులో చేరిన సభ్యులు మరణిస్తే వారి మరణానంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం ఈ స్కీము ముఖ్య ఉద్దేశం. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు దివంగ డాక్టర్ కొత్త రవీంద్రబాబు ఈ స్కీములో చేరారు. ఆయన మరణానంతరం స్కీము కింద వచ్చిన నగదును చెక్కు రూపంలో ఆయన కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జి.విజయలక్ష్మి, డాక్టర్ పావని ప్రియాంక, ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్, కోశాధికారి డాక్టర్ కె.శ్యామ్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.మధు ప్రభాకర్‌బాబు ఉన్నారు.

సర్పంచ్ మహేష్ మరణం పార్టీకి తీరని లోటు

కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మాజీ మంత్రి సుచరిత, దయాసాగర్



కంతేరు(తాడికొండ): కంతేరు గ్రామ సర్పంచ్ బెజ్జం మహేష్ బాబు మరణం వైఎస్సార్ సీపీకి, అతని కుటుంబానికి తీరని లోటు అని మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత, విశ్రాంత ఐటీ కమిషనర్ మేకతోటి దయాసాగర్ దంపతులు అన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన మహేష్ మృత దేహాన్ని మంగళవారం సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మహేష్ అందరి గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారన్నారు. కుటుంబానికి అండగా నిలిచి, అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వారి వెంట పార్టీ మండలాధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

వాహనం నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

పట్నంబజారు: డ్రైవర్లు బస్సు నడిపే సమయంలో తన చేతుల్లో ఎన్నో కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్న విషయాన్ని గుర్తించి డ్రైవింగ్ చేయాలని ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని కంట్రోల్ రూము వద్ద మంగళవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ మనందరి బాధ్యత అనే నినాదంతో ఏర్పాటు చేసిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆర్ఎం రవికాంత్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డీజిల్ ఆదా చేసి తద్వారా సంస్థ ఆర్థిక స్థితి మెరుగు పరిచేందుకు పాటుపడాలని సూచించారు. అదే విధంగా సిబ్బంది ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని సూచించారు.



పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు లేకుండా చూడండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని బోసురోడ్డు, చినరావూరు వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎక్కడా ఫిర్యాదులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈ సుబ్బారావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, పక్కన సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ ప్రకాశరావు

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ఎం.రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేట 30వ వార్డులోని ఉడా పార్కులో ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు నేతృత్వంలో ఏఎస్ఐ హైదర్‌అలీ, పీసీలు పి.మురళి, జి.శ్రీనివాసరావు, జి.నరేంద్ర ఆకస్మిక దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను గమనించి ఆరుగురు వ్యక్తులు పరారయ్యేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. వీరిని గంగానమ్మపేటకు చెందిన అంగిరేకుల గంగాధరరావు, కఠెవరంకు చెందిన పల్లెకొండ దుర్గాప్రసాద్, చెంచుపేట ఇందిరా కాలనీకి చెందిన గద్దం ప్రసాద్, సుందరయ్య కాలనీలో ఉంటున్న షేక్ సైఫా, తెనాలి వీఎస్సార్ కళాశాల కాల్వ కట్ట వద్ద నివసించే అరవపల్లి భువనేశ్వర్, యడ్ల లింగయ్య కాలనీకి చెందిన జానవరపు తేజలుగా గుర్తించారు. వీరిలో గంగాధరరావు, దుర్గాప్రసాద్ విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద 1,100 గ్రాముల గంజాయిని రూ.22 వేలకు కొనుగోలు చేసి తెనాలి తీసుకువచ్చి మిగిలిన వారితో కలసి కొంత వాడుకుని మిగిలినది విక్రయించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ లోగా పోలీసులకు సమాచారం అందడంతో పట్టుబడ్డారని డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి 1,100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ఘనంగా సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న మేజర్లు నాగరాజు, రత్నసుందరి

తెనాలిఅర్బన్: సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఐతానగర్‌లోని సాల్వేషన్ ఆర్మీ చర్చి వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన జెండాను మేజర్ పి.నాగరాజు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 159 సంవత్సరాల క్రితం సాల్వేషన్ ఆర్మీ సంస్థను స్థాపించడం జరిగిందన్నారు. దీని ద్వారా అనేక చర్చిలను ఏర్పాటు చేసి క్రీస్తు బోధన తెలియజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మేజర్ పి.రత్నసుందరి, సంఘ పెద్దలు బట్టు జక్రయ్య, గాలి రవికుమార్, పిల్లి కనకరత్న, కారుమంచి నరసింహం, రుద్రపాటి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరం



క్లస్టర్ స్థాయి విజేతలతో ప్రిన్సిపల్ హనీమెహత

గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని నల్లపాడు కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపల్ హనీమెహత తెలిపారు. గత రెండు రోజులుగా నల్లపాడు గ్రామంలోని పీఎం కేంద్రియ విద్యాలయంలో జరుగుతున్న హైదరాబాద్ రీజియన్ కేంద్రియ విద్యాలయాల బాలికల అండర్ 17 కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి విద్యలోనూ రాణిస్తారన్నారు. హైదరాబాద్ రీజియన్ ఆదేశాల మేరకు రెండు రోజులుగా అండర్ 17 బాలికల క్లస్టర్ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించటం జరిగిందన్నారు. పోటీలలో 9 కేవీల నుంచి 9 జట్లు, సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆరుగురు అధికారుల బృందం మ్యాచ్‌లను పర్యవేక్షించిందన్నారు. కబడ్డీలో బాలికల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. క్లస్టర్ స్థాయి క్రీడల్లో విజేతలు ఈ నెల 6, 7వ తేదీలలో నల్లపాడు కేంద్రియ విద్యాలయంలో జరిగే గుంటూరు రీజియన్ స్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. అనంతరం పోటాపోటీగా సాగిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.లక్ష్మి ప్రసన్న, ఎస్.ఆనంద్, సునీల, పీఈటీలు అంజలి, ఆర్ చాంగ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యేనా?



బస్‌స్టాప్‌లో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

- బస్‌స్టాప్‌లలో అడ్డదిడ్డంగా ఆక్రమణలు
- రహదారిపైనే వాహనాల నిలుపుదల



రహదారిపై ఆటోల నిలుపుదల

పొన్నూరు: ప్రధాన పట్టణాలకు కూడలిగా ఉన్న పొన్నూరు పట్టణ ప్రజలను ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తోంది. ముఖ్యంగా ప్రధాన సెంటర్లలోని నాలుగు బస్‌స్టాప్‌లలో అడ్డదిడ్డంగా ఆటోలు, తోపుడు బండ్లు, ద్విచక్ర వాహనాలు నిలిపివేస్తున్నా పోలీసులు, పురపాలిక సంఘ అధికారులు పట్టించుకోవడం లేదు. అంబేడ్కర్ సెంటర్, కూరగాయల మార్కెట్, రేపల్లె, బాపట్ల బస్‌స్టాప్ సెంటర్లలోని సర్వీసు రోడ్లలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బస్‌స్టాప్‌లకు సమీపంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉండటంతో పాఠశాల విడిచే సమయంలో అధిక సంఖ్యలో విద్యార్థులు బస్ ఎక్కే సమయంలో అవస్థలు పడుతున్నారు. కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని రెండు బస్‌స్టాప్‌ల వద్ద ఆటోలు, బైక్‌లు, పండ్ల వ్యాపారులు తోపుడు బండ్లను అడ్డుగా పెట్టడంతో బస్ ఎక్కేందుకు విద్యార్థులు, ప్రయాణికులు దూరంగా ఉన్న మెయిన్‌రోడ్డు పైకి వచ్చి బస్ ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంటోంది. వాహనాలను దాటుకుని వస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. అధికారులు వెంటనే స్పందించి బస్‌స్టాప్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫాం సకాలంలో అందించాలి

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో పి శైలజ

చేబ్రోలు: విద్యార్థులందరికీ సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆకస్మిక తనిఖీ చేశారు. చేబ్రోలు మండలంలోని స్టూడెంట్ కిట్స్ పంపిణీ, పీఎం పోషన్‌లను పరిశీలించారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్ పంపిణీ, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ గురించి వివరాలు తెలుసుకున్నారు. అదనంగా అవసరమైతే జిల్లా స్థాయి డిపో నుంచి తీసుకొని వివిధ పాఠశాలల నుంచి నూతనంగా చేరిన విద్యార్థులకు కూడా వెంటనే అందజేయాలని తెలిపారు. వేజండ్ల జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు తెలుగు చదవడం మరియు వ్రాయడం గురించి బాగా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత కోసం జాగ్రత్త తీసుకోవాలని సీజనల్ వ్యాధులు పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యలో వెనుకబడిన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంఈవో రాయల సుబ్బారావు, హెచ్ఎం విజయశ్రీ, ఏం ఏడుకొండలు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సేద్య అవసరాలు అందించాలి

రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాంబశివరావు

తెనాలి: రాష్ట్రంలో ఖరీఫ్ తరుణం ప్రారంభమైనందున చిన్న, సన్నకారు రైతుల సేద్య అవసరాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తీర్చాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రైతులను పంట పెట్టుబడి, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సమస్య వెంటాడుతుందని తెలిపారు. పంట పెట్టుబడి కింద రైతులకు ఇచ్చే మొత్తం మే నెలలోనే ఇవ్వాల్సి ఉండగా, ఎన్నికల నిబంధనల పేరుతో అందలేదని గుర్తు చేశారు. ఎన్నికల్లో కూటమి మెజారిటీ సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటైందని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే రూ.13,500 పెట్టుబడి సహాయాన్ని రూ.20 వేలకు పెంచి ఇస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఎన్నికల ప్రణాళికలో హామీనిచ్చినట్టు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 రోజులైనా పంట పెట్టుబడిపై స్పష్టత లేదన్నారు. పంట పెట్టుబడి అంది ఉంటే చిన్న, సన్నకారు రైతులకు కొంత ఊరటగా ఉండేదనీ, పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 88 శాతంపైగా చిన్న, సన్నకారు రైతులే. వారి పరిస్థితులను గమనించి వెంటనే పెట్టుబడి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులతో సహా రైతులందరికీ వడ్డీలేని పంట రుణాలను బ్యాంకుల ద్వారా అందించాలని, రైతులకు విత్తనాలను 80 శాతం సబ్సిడీతో ఇవ్వాలని, ఎరువులపై ఇచ్చే సబ్సిడీలను మరింత పెంచాలని కోరారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

తాడేపల్లిరూరల్: డిగ్రీ చదివిన విద్యార్థులు, నిరుద్యోగులకు మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్ అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని మానవ సేవా సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, ప్రకాశం, కృష్ణా, ఎన్‌టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల్లో డిగ్రీ చదివిన విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్సు (ఎస్‌ఏపీ ఎస్‌డీ)లో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల విద్యార్థులకు మంగళగిరిలోని రత్నాల చెరువు అండర్ పాస్ వద్ద ఉన్న వీఆర్ కాంప్లెక్స్‌లోని మానవ సేవా సంస్థ కార్యాలయం, కృష్ణా, పశ్చిమ గోదావరి, ఎన్‌టీఆర్ జిల్లాల విద్యార్థులకు తాడేపల్లి పట్టణ పరిధిలోని కుంచనపల్లిలో రామ్ స్నేహ అవెన్యూస్, ప్లాట్ నెం. 208లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని తెలిపారు. శని, ఆదివారాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ ఉంటుందని, కాలపరిమితి 3 నెలలని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 70935 29750, 99852 22857 నంబర్లను సంప్రదించాలని కోరారు.